క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష సాయం


బీవీఎస్ రెడ్డిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

లింగపాలెం : మండలంలోని యడవల్లి గ్రామంలో కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి లింగపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్‌రెడ్డి) రూ.లక్ష సాయం అందించారు. బుధవారం యడవల్లి కనక దుర్గమ్మ ఆలయంలో బీవీఎస్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన్ని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పూల మాలలతో సన్మానించారు.

జగమంత కుటుంబం మాది


ప్రగడవరంలో చిలుకూరి ప్రసన్న ఆంజనేయరెడ్డి కుటుంబం

చింతలపూడి : మండలంలోని ప్రగడవరం గ్రామానికి చెందిన చిలుకూరి ప్రసన్న ఆంజనేయరెడ్డి సంతానం బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించుకున్నారు. వివిధ రాష్ట్రాల్లో వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడ్డ సుమారు 100 మంది ఈ వేడుకలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నా కుటుంబ వేడుకల్లో తప్పనిసరిగా కలుసుకోవాలని తీర్మానించుకున్నట్టు హెట్రోడ్రగ్స్ సీనియర్ డైరెక్టర్ చిలుకూరి మోహన్‌రెడ్డి దంపతులు తెలిపారు. చిలుకూరి వంశవృక్ష్యానికి చెందిన ఇంత మంది ఒకే చోట కలుసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. ఇలా కలుసుకోవడం వల్ల కుటుంబ వ్యవస్థ బలపడుతుందని అన్నారు.

అల్లుడికి 365 రకాల వంటలతో విందు


కొత్త అల్లుడికి 365 రకాల వంటకాలతో ఏర్పాటుచేసిన విందుభోజనం

జంగారెడ్డిగూడెం: స్థానిక లైఫ్‌స్టైల్ ఫర్నీచర్ యజమాని తడికమళ్ల దుర్గారావు, జ్యోతి దంపతులు తమ కొత్త అల్లుడికి 365 రకాల వంటకాలతో సంక్రాంతి విందు భోజనం ఏర్పాటు చేశారు. గతేడాది ఆగస్టులో వీరి కుమార్తె అమృత భవ్యశ్రీకి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా వైరా పట్టణానికి చెందిన భరత్ సాయికి ఇచ్చి వివాహం చేశారు. తొలి సంక్రాంతి కావడంతో అల్లుడిని పండుగకు ఆహ్వానించి, 365 రకాల వివిధ రకాల పిండి వంటలు వడ్డించి విందు భోజనం పెట్టి ఆనందింపజేశారు. తమ అల్లుడికి వివిధ రకాల పిండి వంటలతో మర్యాదలు చేయడం ఆనందాన్నిచ్చిందని దుర్గారావు దంపతులు తెలిపారు.

ఘనంగా గంగానమ్మ ఉత్సవం


గంగానమ్మ ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని లక్ష్మీపురంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఘనంగా గ్రామదేవత గంగానమ్మ ఉత్సవాలను గ్రామస్తులు మంగళవారం నిర్వహించారు. డప్పువాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమలు సమర్పించి, పూజలు చేశారు.

రెండు తలల పాము ప్రత్యక్షం


పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంలోకి వచ్చిన రెండు తలల పాము

ద్వారకాతిరుమల: స్థానిక పోలీస్ క్వార్టర్స్ సమీపంలో రెండు తలల పాము బుధవారం ప్రత్యక్షమైంది. వసంత్ నగర్ కాలనీకి వెళుతున్న పలువురి కంట పడటంతో, తొలుత వారు అది ఏ పామో తెలియక భీతిల్లారు. అయితే అది విష సర్పం కాదని, రెండు తలల పాము అని తెలుసుకుని, దానిని హతమార్చకుండా విడిచిపెట్టారు. అది రోడ్డుపై నుంచి సమీపంలోని పొదల్లోకి వెళ్లిపోయింది.

యథేచ్ఛగా పందేలు.. చేతులు మారిన కోట్లు


బుట్టాయగూడెం : దుద్దుకూరులో పందేలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు తెల్లం బాలరాజు, రేగా కాంతారావు


కొయ్యలగూడెం : రామానుజపురంలో పందె గెలిచి రూ.30 లక్షలు సొంతం చేసుకున్న సిండికేట్లు


జంగారెడ్డిగూడెం : పందేలను తిలకిస్తున్న ప్రజలు


జంగారెడ్డిగూడెం : కోళ్లకు కత్తులు కడుతున్న దృశ్యం

- రామానుజపురంలో రూ.30 లక్షల పందెం
- విజేతలకు సత్కారం, బైక్‌ల అందజేత
- బరుల వద్ద గుండాట, పేకాట, కోతాటలు
- ఆయా ప్రాంతాల్లో ట్రాఫికర్

కొయ్యలగూడెం: సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు యథేచ్ఛగా కోడి పందేలు కొనసాగాయి. బరుల వద్దే గుండాట, పేకాట, కోతాట, బ్రాకెట్ తదితర జూద క్రీడలు కొనసాగాయి. రూ.కోట్లు చేతులు మారినట్టు చెబుతున్నారు. బుధవారంతో పందేలు ముగిశాయి. కొయ్యలగూడెం మండల వ్యాప్తంగా 13 చోట్ల కోడిపందేల బరులు, జూద క్రీడల శిబిరాలు కొనసాగాయి. సుమారు రూ.6 కోట్లు చేతులు మారినట్లు సిండికేట్ కేబుల్ నిర్వాహకులు చెబుతున్నారు. కనుమ రోజు రామానుజపురం గ్రామంలో నిర్వహించిన రూ.30 లక్షల పందెం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. జంగారెడ్డిగూడెం, గుంటూరు పందేల రాయుళ్లు సిండికేట్‌గా వ్యవహరించి పందెం నిర్వహించగా జంగారెడ్డిగూడెం సిండికేట్ బృందం భారీ మొత్తాన్ని సొంతం చేసుకుంది. ప్రతిరోజూ బరిలో ఎక్కువగా గెలిచిన విజేతలకు ఆర్గనైజర్ పరిమి రాంబాబు ఆధ్వర్యంలో సత్కరించి బైక్‌లు అందించారు. భోగి రోజు కడియాల శివ (గుంటూరు జిల్లా నరసరావు పేట), సంక్రాంతి నాడు బండారు నాని (జంగారెడ్డిగూడెం), కనుమ నాడు సిమిలి లక్ష్మీ శ్రీకాంత్ (తిరుమలాపురం) గెలుపొందారు. వీరు సుమారుగా మొత్తం రూ.4.50 లక్షల విలువైన బైక్‌లను సొంతం చేసుకున్నారు. గెలిచిన పుంజులతో ఊరేగింపు నిర్వహించారు. రాజవరంలో పందేలను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వీక్షించారు. దిప్పకాయలపాడులో ఫ్లడ్ లైట్స్ మధ్య కోడిపందేలు నిర్వహించారు.

జోరుగా కోడి పందేలు

లింగపాలెం : మండలంలో పండుగ మూడురోజులు కోడిపందేలు జోరుగా సాగాయి. రూ.కోట్లు చేతులు మారినట్టు చెబుతున్నారు. కలరాయునగూడెం, ములగలంపాడు, శింగగూడెం, కె.గోకవరం తదితర గ్రామాల్లోని పామాయిలు, మామిడి తోటల్లో నిర్వహించిన కోడి పందేలకు కృష్ణా, ఖమ్మం జిల్లాల నుంచి భారీగా ప్రజలు, పందెగాళ్లు తరలివచ్చారు. కర్ణాటక, చెన్నా నుంచి పందేలను తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు. ప్రతిరోజు తొలి ముసుగు పందెం రూ.లక్షలు, ఆతరువాత నిర్వహించే పందేలు రూ.50 వేలు చొప్పున జరిగాయని నిర్వాహకులు చెబుతున్నారు. పందేలు వేసిన గ్రామాల్లో ఉదయం, సాయంత్రం సమయాల్లో రోడ్లన్నీ కార్లు, బైక్‌లతో కిక్కిరిశాయి.


కొయ్యలగూడెం : దిప్పకాయలపాడులో రాత్రి వేళలో ఫ్లడ్ లైట్ల మధ్య కోడి పందె వేస్తున్న దృశ్యం


జంగారెడ్డిగూడెం : శ్రీనివాసపురంలో కోళ్లను చూపిస్తున్న దృశ్యం


కొయ్యలగూడెం : రాజవరం బరి వద్ద ఎమ్మెల్యే బాలరాజును ఆశీర్వదిస్తున్న హిజ్రాలు


లింగపాలెం : పందెల్లో కోతముక్క ఆటాడుతున్న దృశ్యం


కుక్కునూరు : కోడి పందెం బరి వద్ద గుండాట


బుట్టాయగూడెం : జీలుగుమిల్లిలో కోడిపందేలను తిలకిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, జబర్దస్త్ బృందం

కుక్కునూరులో హుషారుగా

కుక్కునూరు: ఇటీవల 41.15 కాంటూర్ పరిధిలోని నిర్వాసితుల ఖాతాల్లో ఆర్‌అండ్ఆర్ పరిహారం జమ కావడంతో గత ఏడాదితో పోలిస్తే ఈ సారి కోడి పందేలు మండలంలో మరింత జోరుగా సాగినట్టు చెబుతున్నారు. వేలేరు, చిరవెల్లి, కివ్వాక, కుక్కునూరు, దాచారం తదితర గ్రామాల్లో కోడి పందేలతో పాటు పేకాట, గుండాట, కోతాట వంటి జూదక్రీడలు యథేచ్ఛగా కొనసాగాయి. వేలేరు, కుక్కునూరు బరుల వద్ద రూ.లక్షల్లో పందేలు నిర్వహించినట్టు తెలిసింది. వేలేరు, చిరవెల్లి గ్రామాల్లో బరుల వద్ద పందెం రాయుళ్ల బహాబాహికి దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వేలేరు వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుకు సమీపంలో బరులు ఏర్పాటు చేయడంతో ఆ రహదారిపై ట్రాఫిక్ జామై వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఏజెన్సీలో విచ్చలవిడిగా..

బుట్టాయగూడెం: ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో పండుగ పర్వదినాల పేరుతో యథేచ్ఛగా కోడిపందేలు నిర్వహించారు. గుండాట, కోతాటలు కూడా నిర్వహించారు. కంసాలికుంట, కొమ్ముగూడెం, దొరమామిడి, రెడ్డిగణపవరం, దుద్దుకూరు, ఎస్ఆర్‌పాలెం, తదితర గ్రామాల్లో కోడిపందేలు కొనసాగాయి. రూ.లక్షల్లో చేతులు మారాయి. కనుమ చివరిరోజు బుధవారం సాయంత్రం 5 గంటల తర్వాత పోలీసులు పలు శిబిరాలపై దాడులు నిర్వహించారు. జీలుగుమిల్లిలో ఎస్సై నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది కోడిపందేల కోసం ఏర్పాటు చేసిన టెంట్‌లను, బరులను ధ్వంసం చేశారు.

జంగారెడ్డిగూడెంలో యథేచ్ఛగా..

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలో సంక్రాంతి, కనుమ రోజు కూడా యథేచ్ఛగా కోడిపందేలు నిర్వహించారు. బరుల వద్ద గుండాట, కోత్తాట, జూదాలు జరిగాయి. స్థానిక బైపాస్‌రోడ్డు, మండలంలో శ్రీనివాసపురంలో రెండు బరులు, లక్కవరం, తిరుమలపురం, కేతవరం, గుర్వాయిగూడెం, వేగవరం, ఏ.పోలవరం, తాడువాయి గ్రామాల్లో కోడిపందేలో జోరుగా సాగాయి. పందేలను వీక్షించేందుకు మహిళలు తరలిరావడం విశేషం. వీరి కోసం నిర్వాహకులు ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు.

కోర్టు ఆదేశాలు బేఖాతర్

చింతలపూడి : నియోజకవర్గంలో సంక్రాంతి మూడు రోజులూ కోడి పందేలు జోరుగా సాగాయి. నిబంధనలకు విరుద్ధంగా పందేలు వేయడంతోపాటు కోళ్లకు కత్తులు కూడా కట్టి పందేలు వేశారు. జిల్లాలోని చుట్టుపక్కల ప్రాంతాల నుండే కాకుండ కృష్ణా, ఖమ్మం, వరంగల్, తూర్పుగోదావరి, గుంటూరు, కర్నూలు జిల్లాల నుంచి కూడా పందెం రాయుళ్ల వాహనాల్లో తరలివచ్చి పందేల్లో పాల్గొన్నారు. పండుగ మూడు రోజుల్లో దాదాపు రూ.5 కోట్లకు పైగా చేతులు మారినట్టు చెబుతున్నారు. పందేల ముసుగులో కోసాట, గుండాటలు నిర్వహించారు. మద్యం విక్రయాలు చోరుగా సాగాయి. రాత్రుళ్లు ఫ్లడ్ లైట్ల వెలుగులో పందేలు నిర్వహించారు. పోలీసులు జాడ కానరాకపోవడంతో రాజకీయ నాయకులతో పాటు, అన్నివర్గాల ప్రజలు కోడి పందేల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

కానరాని సంక్రాంతి సందడి

బుట్టాయగూడెం: పేదల కుటుంబాల్లో ఎక్కడా సంక్రాంతి కళ కనిపించలేదని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆరోపించారు. మండలంలోని దుద్దుకూరులో మంగళవారం బాలరాజుతోపాటు పెనుమాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావులు కోడి పందేలను ప్రారంభించి, తిలకించారు. అనంతరం బాలరాజు విలేకర్లతో మాట్లాడారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది సంక్రాంతి పండుగ సందడి గ్రామాల్లో ఎక్కడా కనిపించలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినప్పటికీ పథకాలు సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాల్లో జరిగే పందేలు కేవలం కూర పందేలేనని, వీటిని సంప్రదాయం కోసం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

జీలుగుమిల్లి జబర్దస్త్ సందడి

జీలుగుమిల్లిలో కోడిపందేల బరుల వద్ద బుధవారం జబర్దస్త్ బృందం సందడి చేసింది. రామ్‌ప్రసాద్, కొందరు కళాకారులు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పందేలను తిలకించారు.


కొయ్యలగూడెం : రామానుజపురంలో బుల్లెట్లతో విజేతలు


జంగారెడ్డిగూడెం : కోడిపందాల వద్ద మోటారుసైకిళ్లు


బుట్టాయగూడెం : జీలుగుమిల్లిలో బరిని ధ్వంసం చేసిన పోలీసులు


చింతలపూడి : కోడిపందేల శిబిరం వద్ద గుండాట

పార్వేటి ఉత్సవం కనువిందు


పార్వేటి ఉత్సవంలో డోలు సన్నాయి వాయిద్యాలు


శక్తి వేషధారణ


చిత్రవిచిత్ర వేషధారణలు

ద్వారకాతిరుమల చిన వెంకన్న పార్వేటి (కనుమ) ఉత్సవం అంబరాన్నంటింది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, చిత్ర విచిత్ర వేషధారణలు, గజ, అశ్వ సేవలు, కేరళ డప్పు వాయిద్యాల నడుమ దొరసానిపాడు గ్రామంలో ఈ ఉత్సవం నిర్వహించారు. ఉత్సవాన్ని భక్తులు వీక్షించి పరవశించారు.

- ద్వారకాతిరుమల


కాషాయం జెండాలతో స్వామివారికి స్వాగతం పలుకుతున్న దొరసానిపాడు గ్రామస్తులు


కనుమ ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా గజలక్ష్మి


కేరళ డప్పు వాయిద్యాలు

సంప్రదాయబద్ధంగా సంక్రాంతి వేడుకలు


అంకాలగూడెంలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న మహిళలు

కొయ్యలగూడెం: సంక్రాంతి వేడుకలను ప్రజలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కొయ్యలగూడెం గ్రామదేవత చింతాలమ్మవారితో సహా గ్రామాలలో కొలువైన అమ్మవార్లకు, గ్రామ దేవతలకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అంకాలగూడెంలో భోగి పండ్లు (రేగుపండ్లు) చిన్నారులకు పోసి మహిళలు ఆశీర్వదించారు. ధర్మారావుపేటలో చిన్నారులు బొమ్మల కొలువు ఏర్పాటుచేశారు. నాలుగు తరాలకు చెందిన చెక్క బొమ్మలు, ఏనుగు దంతం బొమ్మలు, కొలువులో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.


ధర్మారావుపేటలో బొమ్మల కొలువు